## కథ

# ప్రజల దిగ్బంధం

**వేగి రామచంద్రరావ్**

**వర్షం! కుండపోతగా ఒకటే వర్షం!!**

**బంగాళాఖాతంలోని వాయుగుండానికి రుతుపవనాలు తోడయ్యాయి.**

**చినుకు వానై వరదై ముసురైంది. ముమ్మరంగా కురుస్తోంది.ఆ బీభత్సానికి సరైన ఆధారం లేని పూరిళ్లు నేల కూలుతున్నాయి.కొంచెం పునాది బలం ఉన్న పెంకుటిళ్ల పైకప్పులు ఎగిరిపోతున్నాయి.**

**అంత ప్రళయంలోనూ ఓ మేడ అదరలేదు... బెదరలేదు. కానీ ఆ మేడలోని కోటీశ్వరరావు మాత్రం కుదురుగా లేడు. కాలుకాలిన పిల్లిలా గదిలో అటూ ఇటూ తిరుగుతున్నాడు.**

ఆయన ఆగర్భశ్రీమంతుడేమీ కాడు. కింద నుంచి పైకి వచ్చిన వాడు. నాలుగిళ్లల్లో తోటపనిలో మొదలుపెట్టి నాలుగూళ్లల్లో మట్టిపనికి మారిన వాడు. ఆ తర్వాత నలుగురు కాంట్రాక్టర్ల వద్ద కూలీలను సరఫరా చేసే సబ్ కాంట్రాక్టర్లలో తనూ ఒకడిగా చేరిన వాడు. ఆపై సొంతంగా తనే కాంట్రాక్టు పనులు మొదలుపెట్టాడు. ఎప్పుడూ పదిమందికి పనులు పురమాయిస్తూ గడిపే కోటీశ్వరరావు కూలీల మధ్య వచ్చే చిన్న చిన్న తగాదాలు సర్దిచెబుతూ 'సెటిల్మెంట్ల దాదా'గా ఎదిగాడు. దాంతో పేరు ప్రఖ్యాతులే కాదు అప్పలంగా ఆస్తులు కూడా వచ్చిపడ్డాయి. వాటి మీది ఆదాయాలు కొత్త వ్యాపారాన్ని తెచ్చాయి. ''ఇంతై.. ఇంతింతై.. వటుడింతై'' అన్నట్లు కోటయ్య నుంచి కోటన్నగాను పిమ్మట కోటిగాడుగాను ఎదిగి ఆ వెనక కోటీశ్వరరావుగా సెటిల్‌పడిపోయాడు.

కోటీశ్వరరావు ఏ బడిలోనూ చదవలేదు. అయితేనేం! చదువుకున్నోళ్లకు ఏమాత్రం తీసిపోకుండా నాలుగైదు భాషలు మాట్లాడగలడు. వ్యాపారంలో రాణించాలంటే మనం చెప్పేదేంటో ఎదుటి వాడికి, వాడు చెప్పేది మనకు అర్థం కావాలి'' అన్న కిటుకు జీవితపు తొలినాళ్లల్లోనే తెలుసుకొని మన పొరుగు రాష్ట్రాల భాషలన్నీ నేర్చుకున్నాడు. అయితే ఏదీ రాయలేడు. ఆఖరికి సంతకం కూడా. కావాలనే దాన్ని నేర్చుకోలేదు. వేలిముద్ర అయితే ఫోర్జరీకి అవకాశం బాగా తక్కువన్నది ఆయన నమ్మకం. అలా ఏ పనిలోనైనా తనదంటూ ఓ ముద్ర వేసుకున్న కోటీశ్వరరావు ఎంతో ఎత్తుకు ఎదిగినా పాతఅలవాట్లలో రెండింటిని మాత్రం ఇప్పటికీ మార్చుకోలేదు.

మొదటిది - తలకు గుడ్డచుట్టుకోవడం. అమెరికా వెళ్లినా ... అమ్మాయితో గడిపినా తలకు గుడ్డ కట్టుకునే ఉంటాడు. ''నేను మట్టి మోసి ఇంతటివాడ్నయ్యాను. ఆ సంగతి మర్చిపోకూడదనే గుడ్డ కడుతుంటాను'' అంటాడు ఎవరైనా అడిగితే.

ఇక రెండోది - 'మందు..పొందు''. పగలంతా గొడ్డులా కష్టపడినా రాత్రి ఎనిమిదయ్యేసరికి టీపాయ్ ముందు విస్కీ బాటిల్‌తో కూర్చుంటాడు. పదయ్యేసరికి 'పరువాల పరుపు'పై పవళిస్తాడు.'' అలసిన మనిషిలో.. మనసులో ఉత్సాహం నింపేవి. 'మధువు-మగువ'. ఈ రెండే కదా'' అంటుంటాడు తన సన్నిహితులతో సరదాగా.

రెండు రోజులుగా ఆ రెండింటికీ లోటొచ్చింది. అందుకే కుదురుగా ఉండలేకపోతున్నాడు.

కోరికతో చచ్చిపోతున్నాడు. కోపంతో రెచ్చిపోతున్నాడు.

ముసురుకు మూడు రోజుల ముందు తన ఇంటిలో బిజినెస్ ప్రముఖులకు పార్టీలు ఇచ్చాడు. ఆ తర్వాత వాళ్లతో కలసి కొత్త ప్రాజెక్టు స్థలం చూడ్డానికి బెంగుళూరు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి ముసురు. వరుసపార్టీలతో ఇంట్లో 'సరకు' కాస్తా అయిపోయింది. తెప్పించుకుందామంటే గుట్టుగా తెచ్చేవారెవరూ లేరు. ఈ పనులన్నీ ఎప్పటికప్పుడు చేసిపెట్టే 'నమ్మిన బంటు' ఈ వేళ రాలేదు. కాదు.. తనే రావద్దన్నాడు. ''నీ ముఖం నాకు చూపించక'' అని తగిలేశాడు.

కిటికీలోంచి సన్నగా లోపల పడుతున్న నీటి తుంపరలకు కంపరమెత్తిపోతున్నాడు. తీరని కోరికతో వెంపరలాడిపోతున్నాడు. నిజానికి సన్నగా పడే చినుకులన్నా, వాటిలో తడవటం అన్నా ఆయనకు చాలా సరదా. చినుకుల్లో మేడ మీద నడుస్తూ.. తడుస్తూ మధ్యమధ్య మందుకొడుతూ గడపడమంటే ఇంకా ఇంకా సరదా.

కోటీశ్వరరావు మనసు పరిపరి విధాలా ఆలోచిస్తోంది.

బయట మెరుపులు! చురకత్తుల్లా తాకుతున్నాయి.. గీకుతున్నాయి. ఆ చిరాకు? సహించలేక విసవిస లోపలికి వెళ్లాడు. అల్మారా తీశాడు. ఖాళీ సీసాలు చెల్లాచెదురుగా ఉన్నాయి. ఉన్నట్టుండి పెద్ద మెరుపు మెరిసింది. వెలుగుపర్చుకుంది. సీసాల వెనక దాక్కున్న ఓ సీసాలో అడుగున కొంచెం ఉండిపోయిన మందు జిగేల్‌మంది. నాలుక జివ్వుమంది. ఆత్రంగా తీశాడు. గ్లాసులో పోశాడు. నీళ్లు కలిపాడు. గొంతులో పోశాడు.

రిలాక్స్ అవుదామనుకున్నాడు. కానీ రివర్స్ అయింది. ఇప్పటివరకూ ఒక్క మనసే మాట వినేది కాదు. ఇప్పుడు శరీరంలోని అణువణువూ ఎదురు తిరుగుతోంది.

ఇలాటప్పుడు ఆదుకోవల్సిన భార్య మంచమెక్కింది. అయితే మంచం..లేదంటే వీల్‌కుర్చీ! ఆ రెండింటికీ ఆమె పరిమితం. డబ్బుకు లోకం దాసోహం అవుతుందేమోకానీ, కొన్ని జబ్బులు కావు..పోవు.

సపర్యలు చేయాల్సిన కొడుకులు కోడళ్లు పరాయి దేశాల్లో డాలర్ల పంట పండిస్తున్నారు. ఇక్కడ లంకంత కొంపలో తను. ఒంటరిగా...తుంటరిగా.

కళ్లు మిరుమిట్లు గొలుపుతూ మెరుపు! కళ్లు మూసుకొని అంతలోనే తెరిచాడు.


మళ్లీ నమ్మిన బంటు గుర్తొచ్చాడు. అవసరాలు ప్రాధాన్యతల్ని చెరిపేస్తాయి.

కోరిక కొండచిలువ అహం..ఇహం అన్న తేడా లేకుండా దేన్నైనా మింగేస్తుంది.

బయట ఆకాశంలో మెరుపులు! గొప్పోళ్ల షోకుల్లా...సరదాల్లా వింతగా!

ఊరి నుంచి తిరిగి వచ్చిన వెంటనే కోటీశ్వరరావు ముందు ఫోన్ చేసింది తన గర్ల్‌ఫ్రెండ్ రోజీకి. ఆమె లేదు. ఊరు వెళ్లిందట. దాంతో అప్పుడెప్పుడో రోజీ ద్వారా పరిచయమైన మోతీకి ఫోన్ చేశాడు. ఆమె తన బాస్‌తో కలసి కాంప్‌లో ఉందని తెల్సి ఉస్సూరుమన్నాడు.

''ఇప్పుడెలా? మరెవరికైనా పురమాయిద్దామన్నా ఎవరున్నారు? ఉన్న.. విషయం బయటకు పొక్కి పరువుపోదూ!? పోనీ పొమ్మన్నవాడ్నే రమ్మంటే?.. బాగానే ఉంది. కానీ పిలిచేదెవరు?''-



క్షణం క్రితం ''వాడ్ని ఎవరు పిలుస్తారు?'' అనుకున్న వాడు ''ఇపుడు వాడ్ని పిలిస్తే బాగుణ్ను'' అనుకున్నాడు.

'చెడ్డ పనులకు చెడ్డవాళ్లనే వాడుకోవాలి' అని తనను తాను సమర్థించుకుంటూ ఫోన్ తీశాడు. ఉన్నపళంగా జగన్నాథంను రమ్మన్నాడు. కావల్సినవి ఎంత ఖర్చైనా తెమ్మన్నాడు.

బయట మెరుపులు. ఇప్పుడవి చురకత్తులు కావు. విరిగుత్తులు! మురిపిస్తున్నాయి. ముద్దొస్తున్నాయి.

★ ★ ★

పెంకుటింటి చూరు కింద వాలుకుర్చీలో పడుకొని ఉన్నాడు జగన్నాథం. ఏకధాటిగా కురుస్తున్న వర్షాన్ని తదేకంగా చూస్తున్నాడు. వాన నీటిలో ఒక దాని వెనక మరొక బుడగ. తన జీవితంలో కూడా సమస్యల మీద సమస్యలు. వాటితో సతమతమవుతూ పరధ్యానంగా ఉన్నవాడు హాల్‌లో ఫోన్ శబ్దానికి లేచి రిసీవర్ ఎత్తి యథాలాపంగా 'హలో' అన్నాడు. కోటీశ్వరరావు గొంతు వినపడే సరికి తనను తాను సర్దుకొని ''సార్..సార్..'' అన్నాడు. సంభాషణ సాంతం ''సార్..అలాగే సార్.. ఓకే సార్'' అంటూ విన్నాడు.

జగన్నాథం తన చెవుల్ని తానే నమ్మలేకపోతున్నాడు.

కోటీశ్వరరావు నుంచి మళ్లీ పిలుపు వస్తుందని తను ఊహించలేకపోయాడు.

అది మాత్రమే కాదు.. జగన్నాథం జీవితంలో ఏదీ కూడా అతను ఊహించనట్లు జరగలేదు.

ఒక చేత్తో రెండు జానెడుల పట్టా, మరో చేత్తో జానెడు పొట్ట పట్టుకొని ఉద్యోగం కోసం ఎక్కే గుమ్మం దిగే గుమ్మంలా తిరిగిన జగన్నాథం అసలు ఉద్యోగం కోసం తను ఎవరి కాళ్లూ పట్టుకోవల్సిన పని ఉండదని అనుకున్నాడు. మేథమెటిక్స్‌లో గోల్డ్ మెడలిస్ట్ అయిన తన కాళ్ల దగ్గరికే ఉద్యోగం వస్తుందని ధీమా పడ్డాడు. కానీ కాళ్ల చెప్పులే కాదు.. మోకాళ్ల చిప్పలు కూడా అరిగి చివరి రోజు తల తిరిగి ఓ మేడ ముందు మెట్లమీద పడిపోయాడు.

అప్పుడు ఆదుకున్నది కోటీశ్వరరావు. తన కున్న వ్యాపారాలలో ఒకటైన బ్రాకెట్ కంపెనీకి లెక్కలు తెల్సిన మనిషి కోసం ఆయన చూస్తున్నాడు. వెతకబోయిన తీగలాగ తగిలిన జగన్నాథాన్ని లేవదీశాడు. చేరదీశాడు. బ్రాకెట్ కంపెనీ బరువు బాధ్యతల్ని అప్పజెప్పాడు.

బ్రాకెట్ ఆడేవాళ్లకు నిత్యం కత్తిమీద సాము. ఆడించేవాళ్లకు లెక్కల మీద విశ్వాసం. ఆ పని జగన్నాథం అవలీలగా చేసేవాడు. రోజూ ఏ సెంటర్ నుంచి ఏ నెంబర్ మీద ఎంత పందెం జరిగిందీ ఏజెంట్ల ద్వారా క్షణాల్లో చేరేది. అందులో ఏ నెంబర్‌ను తొక్కిపెట్టి ఏ నెంబర్‌ను వదిలిపెడితే వచ్చేదెంత పోయేదెంత.. చకచక లెక్క కట్టి టక టక చెప్పేవాడు.

లెక్కల్లోని తన పాండిత్యం ప్రజల్ని ప్రభావితం చేసే ప్రణాళికా రచనలాటి దానికి ఉపయోగించాలని ఎంతో తాపత్రయపడిన జగన్నాథం తన కల ఇలా తీరుతుందని ఊహించలేదు. జీవిత గమనం మలుపు తిప్పే ఉద్యోగమే కాదు.. అంతకు మించి ఎంతో ప్రాముఖ్యత గల పెళ్లి కూడా తను అనుకున్నట్లు జరగలేదు. అప్పటిదాకా తండ్రి మాటే మార్గం.. తండ్రి బాటే స్వర్గంగా గడిపిన జగన్నాథానికి తండ్రి చూపిన అమ్మాయే అర్ధాంగైంది. తన ఆశలు.. ఆలోచనలు ఏవీ కూడా తండ్రితో చెప్పుకోలేకపోయాడు.

పోనీ భార్యతోనైనా చెప్పుకున్నాడా? అదీ లేదు! వరుసగా నలుగురు ఆడపిల్లలు పుట్టాక ఇక సరి

పెట్టేద్దామని అన్నాడు జగన్నాథం.

''కనేదాన్ని నేను కదా. మధ్యలో మీకేవిటి బాధ?'' అంది భార్యామణి.

''ఔన్నిజమే. నాకెందుకు బాధ'' అనుకో లేదు, ''కనేది నీవే అయినా పెంచేది నేను కదే'' అని కూడా అనలేదు. ''ఇల్లు చక్కబడాలంటే భార్య మాట సాగాల్సిందే. కానీ భర్తను మాటాడ నీయకుండా చేసి కాదు'' అని ఎన్నోసార్లు అనుకున్న ఈ మాటలు కూడా ఆవిడ దగ్గర అనలేకపోయాడు. ఏడుగురు ఆడపిల్లలు తర్వాత ఓ మగపిల్లాడు పుట్టాడు. భార్య కన్నా జగన్నాథమే ఎక్కువ ఆనందించాడు. తన కుచేల కుటుంబానికి ఇక తెర పడుతుందని ఆశించాడు. అదీ జరగలేదు.

''వాడు ఒంటరి వాడు కాకూడదు. తోడుగా మరొకడు ఉండాల్సిందే. మా అమ్మమ్మకు కూడా ఇలాగే ఏడుగురాడపిల్లలు తర్వాత ఇద్దరు మొగపిల్లలు పుట్టారు. మనకీ పుడతారు'' అంది భార్యామణి.

జగన్నాథమే కాదు.. ఆ జగన్నాథుడు కూడా ఆ స్పీడ్‌కు జడిశారో.. ఆ మూడ్‌కు మురిశారో చిత్రంగా మళ్లీ మగపిల్లవాడే పుట్టాడు.

పిల్లలు పెద్దవాళ్లు అవుతున్నారు. అందులోనూ ఆడపిల్లలు! ఖర్చుల మీద ఖర్చులు. అందుకు ఆదాయం కోసం అర్రులు చాచేవాడు. కొత్తదారులు తొక్కేవాడు. అడ్డదారులు పట్టేవాడు. అవసరాలు అంతపని చేయించేవి.

కోటీశ్వరరావు దగ్గర ఉద్యోగం చేస్తూనే సైడ్ బిజినెస్‌లు కూడా చేసేవాడు. అందులో చీట్‌ల వ్యాపారం ఒకటి. మొదట్లో రిజిస్టర్డ్ కంపెనీలకు మెంబర్లను మాత్రమే బుక్ చేసేవాడు. అవి కమిషన్ ఇచ్చేవి. వాటి రుచి మరిగిన అతను సొంతంగా చిట్ ఫండ్ కంపెనీ పెట్టాడు. రిజిస్ట్రేషన్ చేయిస్తే బోలెడు తతంగమని అనధికారికంగా నడిపేవాడు. అదే తన పుట్టిముంచుతుందని ఊహించలేకపోయాడు.

గ్రూప్‌ల మీద గ్రూప్‌లు స్టార్ట్ చేశాడు. గ్రూప్ మొదలుపెట్టడం మీద చూపించిన శ్రద్ధ సభ్యుల ఎంపిక మీద చూపేవాడు కాడు. ఫలితంగా అన్ని రకాల వాళ్లూ సభ్యులయిపోయారు. దీనికి తోడు ఇంట్లో ఎప్పుడూ సమస్యలుండేవి. జేబులో ఎప్పుడూ డబ్బులుండేవి. ఖర్చు పెట్టేటప్పుడు ఐదు.. పదే కదా అనిపించేవి. లెక్క చూసుకొనే సరికి లోటు వందల్లో కనిపించేది. ఆ లోటు పూడ్చడానికి తన దగ్గర మెంబర్లలో చిట్ వేలంపాట దగ్గరకు వచ్చే అలవాటు లేని మెంబర్ చీటీని తను పాడుకొనేవాడు. ఆ మెంబర్‌కు సెటిల్ చేయాల్సి వచ్చినపుడు మరో గ్రూప్‌లో ఇదే పని చేసేవాడు. ఇదంతా నాణానికి ఒక పార్శ్వమైతే - జగన్నాథం దగ్గర చీటిపాడుకున్న వాళ్లలో కొందరు బకాయిలు కట్టేవారు కారు. రిజిస్టర్డ్ కంపెనీ కాకపోవడం వలన బకాయిదార్లపై చట్టపరమైన చర్యలు తీసుకోలేకపోయేవాడు.

పైగా గట్టిగా గొడవ పెంచుకొని వీధిన పడితే పోలీసుల దృష్టికి వెళ్తుందేమోనని తనే భయపడేవాడు. దీన్ని అలుసుగా తీసుకొని బకాయిదార్లు ఏకంగా ఎగవేసేవారు.

అలా బకాయిదార్లు ఎగవేసిన దానికీ తనే బాధ్యత వహించి, తాను వాడేసుకున్న చిట్ సొమ్ము కూడా కలిపితే లక్షల్లో లెక్క తేలింది. చిట్‌లు మొదలుపెట్టిన మొదటి ఐదేళ్లు బాగానే నడిచింది. ఆ తర్వాతే తనకు తెలీకుండానే ఊబిలో కూరుకుపోయాడు. అన్ని గ్రూప్‌లలోనూ ఆఖరుకు ఉండిపోయిన మెంబర్లకు పూర్తి చిట్ సొమ్ము సెటిల్ చేయడానికి కావల్సిన లక్షలాది రూపాయలు లేక కొద్ది రోజులు మనిషి పరారైపోయాడు. జనం కొంచెం ఏమరిచాక మళ్లీ ఇల్లు చేరాడు. ఆ సంగతి తెల్సి రోజూ ఇంటి మీద పడి ఎవరో ఒకరు నానా రభస చేసేవారు. వాళ్లను 'సామ దాన భేద దండోపాయాలు' ఉపయోగించి పంపేవాడు.

జగన్నాథం దగ్గర చిట్ కట్టిన వాళ్లలో తనతో పాటు పని చేస్తున్నవారు కూడా ఇద్దరున్నారు. వారిలో ఒకాయన తన కూతురి వివాహ సమయానికి చేతికి అందుతాయన్న ఆశతో కట్టాడు. ఆ విషయమై కోటీశ్వరరావు దగ్గర చెప్పుకొని లబోదిబోమన్నాడు.

అప్పటికి పది రోజులుగా పనిలోకి రాని జగన్నాథాన్ని రప్పించి 'స్టాఫ్‌మెంబర్స్ సొమ్ము ఇస్తావా..ఛస్తావా?'' అని ఒత్తిడి చేశాడు. గత్యంతరం లేక భార్యామణికి అడపాదడపా తాను చేయించిన నగలకు పిల్లల పేరు మీద దాచిన సొమ్ము కూడా కలిపి స్టాఫ్‌కు ఇవ్వాల్సింది ఇచ్చేశాడు. జగన్నాథంలోని ఏ తెలివితేటల్ని చూసి మొదట మురిసిపోయాడో అదే పాండిత్యానికి ఇప్పుడు జడిసి ఉద్యోగంలోంచి డిస్మిస్ చేశాడు కోటీశ్వరరావు.

నల్లేరు మీద నడకలా సాఫీగా సాగిపోతుందనుకున్న జీవితం ఇలా పల్లేరు మీద పడకలా దుర్భరమవుతుందని కలలో కూడా జగన్నాథం ఊహించలేదు.

మూడు రోజుల నుంచి దంచేస్తున్న వర్షానికి ఇంట్లో సరుకులు నిండుకున్నాయి. ఎండ పొద్దెరగని ఇల్లు గలీజుగా ఉంది. పిల్లాపిచుకు అంతా ముసురుకు ఇంట్లోనే ఉన్నారేమో గందరగోళంగా ఉంది. మాసిన బట్టలు చిందరవందరగా ఉన్నాయి. తడిసిన బట్టలు తలుపులు, కిటికీల రెక్కల మీద నీళ్లోడుతున్నాయి. గచ్చులన్నీ గబ్బు పట్టి ఉన్నాయి.

బయట ఆకాశంలో మెరుపులు! ఇంట్లో భార్యామణి అరుపులు!? వాలుకుర్చీలోని జగన్నాథానికి కాంతి రేఖలా కోటీశ్వరరావు నుంచి ఆహ్వానం! అయితే ఆ ఆనందం ఎంతోసేపు నిలవలేదు. ఉన్న సమస్యల్లో ఒకటి తీరింది. మరొకటి చేరింది.

''మందు ఎలాగోలా సంపాదించవచ్చు. మగువనెలా తేవడం?'' ఆలోచిస్తున్నాడు.

కోటీశ్వరరావు దగ్గర పనిచేసే రోజుల్లో ఆయన దగ్గర మరింత పలుకుబడి పెంచుకోవాలనే ప్లాన్‌తో అతని బలహీనతల్ని వాడుకున్నాడు. తెల్సిన స్మగ్లర్ దగ్గర ఫారిన్ విస్కీ బాటిల్ కొని ఆయన దగ్గరకెళ్లి తనకెవరో ఇచ్చారని, తమ బోటి పెద్దలకే గానీ నాలాటి వాడికి తగదని ఆఫర్ చేశాడు.

కోటీశ్వరరావు కళ్లు మిలమిల మెరిశాయి. అప్పటి నుంచి ఫారిన్ సరకు ఎప్పుడు కావాలన్నా జగన్నాథం చేత తెప్పించుకొనేవాడు. అలా 'స్వామి కార్యం - స్వకార్యం' రెండూ జరిగేవి. ఆ పరిచయాలు ఇంకా ఉన్నాయి.


''బాటిల్ సరే.. భామనెలా పట్టుకోవడం'' అంతుపట్టడం లేదు. తనకు తెల్సిన ఆడవాళ్లలో 'ఎగస్త్రాలు' పోయేవాళ్లు ఎవరైనా ఉన్నారేమోనని జుట్టుపీక్కుంటున్నాడు''. ఒకవేళ ఉన్నా ఇప్పటికిప్పుడు ఎలా పట్టుకోవడం'' అర్థంకాక బుర్ర గోక్కుంటున్నాడు.

''పోనీ చిలకలపేటలో ఎవరైనా ఉన్నారేమో ప్రయత్నిస్తే?''.. స్ఫురించింది.

తనుంటున్న కాలనీని ఆనుకొని ఉన్నదే చిలకలపేట. అందులో ఉండేది మెజార్టీ లేబర్ క్లాసే ''ఔను వాళ్లయితే సులువుగా పడిపోతారు. పూటగడవడానికి ఎంతకైనా తెగిస్తారు.'' అనుకున్నాడు.

''ఎవరికైనా తెలిస్తే?!''

''తప్పేముంది? చెడిపోయిన వాళ్లను వాడుకుంటున్నాను గానీ నాకుగా ఎవర్నీ చెడుపడం లేదుగా!'' అని తనను తాను



సమర్థించుకున్నాడు. అదే పనిగా ఆలోచించిన జగన్నాథానికి కోటీశ్వరరావు ఇంట్లోని పనిమనిషి గుర్తొచ్చింది.

''ఔనూ.. ఆ పనిమనిషి ఉండేది చిలకలపేటలోనే కదా!'' జల్లెడ పట్టి చూస్తున్నాడు. ''దానికి ఓ కూతురు కూడా ఉన్నట్టు గుర్తు.'' అనుకున్నాడు.

ఆకాశంలో మెరుపు వెలుగులో మబ్బులు కనిపించినట్టు జగన్నాథానికి సుబ్బులు కనిపించింది.

★ ★ ★

ఊరికి కొంచెం దూరంలో ఉన్న ఆ గుడిశలు మన సినిమాల్లో ఆర్ట్ డైరెక్టర్స్ వేసే గుడిశల్లా అందంగా లేవు. ప్రజల మధ్య కొచ్చినపుడు కుటీరంలోనే కొలువుంటానని చెప్పే మన ప్రియతమ నాయకులకు అధికారులు అమర్చే కుటీరాల్లా హంగు, ఆర్భాటంగానూ లేవు. నీటిలో తేలియాడే తాటాకు గొడుగుల్లా ఉన్నాయి వాటి మొదళ్లు కనిపించక.

జీవితపు అడుగుమెట్ల మీదే దేవురించే వాళ్ల కళ్లల్లోనీళ్లు! వారి ఇళ్లల్లో నీళ్లు!!

గుడిశ కన్నాల్లోంచి ధారాపాతంగా కారుతున్న వాన నీటి వంక కన్నార్పకుండా చూస్తోంది సుబ్బులు. ఆరుబయట ఉన్నదానికి, గుడిశలో ఉన్నదానికి తేడా తెలీకుండా ఉందామెకు.

గుడిశలో ఓ మూల కుక్కిమంచంపై తల్లి! మాసిన బట్టల మూటలా పడి ఉంది. ఆమెకు జ్వరం. ఎన్ని మందులు వాడుతున్నా తగ్గడం లేదు. పైగా అణచివేస్తున్న కొద్దీ అధికమవుతున్న అవినీతి లాగ ఎక్కువవుతోంది. పెద్దాసుపత్రికి తీసుకువెళ్దామని అనేకసార్లు సుబ్బులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

''పెద్దాసుపత్రికి నేను రానంటే రాను''.. అని ఆమె మొండికేసింది. ''ఓ పిచ్చి గాని.. పెద్దాసుపత్రికెళ్తే నాకు తగ్గుతాదేంటీ?! నాకెలాగూ తగ్గదు. నా సంగతొదిలీ.. అయినదానికి కానిదానికి డబ్బు గుంజుతూ నిన్ను పీక్కు తినేస్తారే'' అనేది తల్లి.

వాననీరు లోపలికి రాకుండా ఇంట్లో ఉన్న చెక్క ముక్కల్ని గుడిశ గుమ్మం దగ్గర అడ్డుపెట్టింది. అయినా అది ఆగడం లేదు

''అమ్మా''... పిలుపో..మూలుగో అన్నట్లు పిలిచిందామె.

''ఏవిటి?'' అన్నట్లు తల్లివైపు చూసింది సుబ్బులు.

''అన్నొయ్యొచ్చాడా?'' అడిగింది తల్లి.

''అబ్బ.. ఇప్పటికి 66సార్లు అడిగావు. రాలేదని ఎన్నిసార్లు చెప్పాలి నీకు?'' అని నాలుక చివరి దాకా వచ్చిన మాటల్ని దిగమింగింది. తల్లిగొంతులో పలికిన దైన్యానికి కంట తడి పెట్టకుండా ఉండలేకపోయింది. చెమ్మగిల్లిన కళ్లతో తల్లిపక్కన కూర్చొని చేతిలో చేయి వేసి నెమ్మదిగా పట్టుకుంది. కూతురి చేతిని వదిలేయకుండా గట్టిగా.. మరింత గట్టిగా పట్టుకొని గుండెలకు అదుముకుంది.

''ఏం తల్లీ.. సూరీడు రాలేదా?'' మళ్లీ అడిగింది తల్లి.

''లేదమ్మా. అయినా ఆడి కోసం ఎందుకే కలవరిస్తావు. ఆడు ఎక్కడున్నాడో ఏటో... నీకు బాగోలేదని ఆడికి తెల్సా ఏటి వచ్చీడానికి?'' అంది. వీలైనంత శాంతంగా ఆ మాటలు అన్నా. కల్సిరాని తోబుట్టువుపై కడుపులో బాధ గొంతులో తొణికిసలాడింది. కానరాని అన్నయ్య కనిపిస్తే బాగుణ్ణు అన్న కోరిక కనిపించింది.


''అలా అనకమ్మా. ఆడు రాకుండా ఉండడు. నేను సచ్చీలోపు వస్తాడు సూడు. ఇంతకు ముందు అలాగ ఎన్నిసార్లు రాలేదు తల్లి?'' అంది. ఆమె మాటల్లో ఎదురుప్రశ్నతో పాటు కనిపించకుండా పోయిన కొడుకు కోసం ఎదురుచూపుంది. కడుపు తీపుంది.

నిజమే. సూరీడు అలా చాలాసార్లు వచ్చాడు.. వెళ్లాడు. తండ్రి కొట్టాడని తొలుత సూరీడు ఇల్లు వదిలి పారిపోయాడు. అలా పోయినవాడు ఓ ఏడాది గడిచాక తిరిగొచ్చాడు.

అప్పుడు తండ్రికి ఏదో దెబ్బ తగిలి ఇంట్లోనే ఉన్నాడు పనికిపోకుండా. తండ్రీ కొడుకు ఒకరినొకరు చూసుకొని, ఒకరినొకరు పట్టుకొని ఏడ్చారు.

వారం రోజులు గడిచాయి. కనిపించకుండా పోయిన ఆ ఏడాదంతా ఎక్కడెక్కడ తిరిగాడో ఏమేమి చేశాడో.. చూశాడో కథలుగా చెప్పేవాడు.'' అయితే ఎక్కడున్నా ఏం చేసినా మీకు తలవంపులు తెచ్చే పని మాత్రం చెయ్యలేదు.. చెయ్యబోను'' అనేవాడు.

ఆ మాటలకు తల్లిదండ్రులిద్దరూ పొంగిపోయేవారు.




వారం రోజులు బాగానే గడిచాయి. ఓ రోజు వీధిలో వాళ్లతో సూరీడు ఏదో గొడవ పెట్టుకున్నాడు. అది ఇంటిదాకా వచ్చింది. తండ్రి చీవాట్లేశాడు. బుద్ధిగా ఉండలేవా? అన్నాడు. మాటా మాటా పెరిగింది.

అంతే.. మళ్లీ కనిపించకుండా పోయాడు.

అలా పోయినవాడు ఓ ఆరునెలలు గడిచేసరికి మళ్లీ వచ్చాడు. ఈసారి సూరీడు వచ్చిన నాటికి వాళ్ల దగ్గరి బంధువుల పెళ్లి జరుగుతోంది. ''భలే వచ్చావురా సమయానికి'' అని సూరీడ్ని చూసి అంతా సంతోషించారు. సూరీడు ఇలా పరారై అలా తిరిగి వచ్చిన ప్రతీసారీ ఏదోఒక కార్యక్రమం ఆనందం పంచేదో.. విచారం నింపేదో ఏదో ఒకటి జరిగేది. దాంతో 'ముక్కుమీద ఈగ వాలి కబురందిస్తున్నట్లు'' భలే వస్తున్నావురా అనేవాళ్లు. ఆఖరుకి తండ్రి చనిపోయినప్పుడు కూడా సూరీడు అలాగే వచ్చి అందరినీ ఆశ్చర్యపర్చాడు.

సుబ్బులు తండ్రి క్వారీపనికి వెళ్లేవాడు. కొండను తవ్వి రాళ్లను లారీలకు ఎత్తేవాడు. ఒక రోజు పెద్దరాయిని నలుగురు కలసి గునపాల సాయంతో లారీ ఎక్కిస్తున్నారు. అదికాస్తా పట్టు తప్పింది. సుబ్బులు తండ్రి మీద పడిపోయింది. ఆ ప్రమాదంలో అతని రెండు కాళ్లూ నుజ్జునుజ్జయ్యాయి. ఉన్న పళంగా పెద్దాసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ ఓ పది రోజులు మృత్యువుతో పోరాడి చివరకు కన్నుమూశాడు.

తండ్రి అంత్యక్రియలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

అప్పుడు దిగేడు సూరీడు! 'రుణానుబంధం అంటే ఇదేనేమో!'' అనుకున్నారంతా.

అంత్యక్రియలు అయిపోయాయి. ఆ సాయంత్రం - తండ్రి పనిచేసే కాంట్రాక్టర్ ఆఫీసుకు వెళ్లి ఆయనతో గొడవ పెట్టుకున్నాడు సూరీడు. తన తండ్రి చావుకు నష్టపరిహారం ఇవ్వమని అడిగాడు.

పైసా ఇవ్వనన్నాడు కంట్రాక్టర్. ''నేను కనుక.. చావు ఖర్చులకు డబ్బు ఇచ్చాను. మరొకరైతే అవి కూడా ఇవ్వరు తాగి పన్లోకి వచ్చాడు. పోయాడు. దానికి నేనా బాధ్యుణ్ని?'' అన్నాడు.

మాటామాటా పెరిగింది. పట్టరాని కోపంతో కంట్రాక్టర్‌ను సూరీడు నాలుగు పీకాడు. అంతే.. ఆ తర్వాత మరి కనపడలేదు.

సుబ్బులు తల్లి ఎంతోమంది కంట్రాక్టర్లను పనివ్వమని ప్రాధేయపడింది. ఎవరూ పనివ్వలేదు. దానికి సూరీడి నిర్వాకం ఒక కారణమైతే వయసు మీద పడటం రెండోది.

నాలుగు రోజులు వాళ్లూ వీళ్లూ

ఆదుకున్నారు. ఎవరైనా ఎంతకాలం చూస్తారు?

ఆకలి మంటలకు తాళలేక ''అమ్మా... నేను పన్లోకెళ్తానే'' అంది సుబ్బులు.

''వద్దమ్మ.. వద్దు'' అంది. కాపురానికి పంపించాల్సిన కూతుర్ని ప న్లోకి పంపించడం ఇష్టం లేక.

కానీ పస్తుల ముందు పద్ధతులు బలాదూర్ కదా. మగదిక్కులేని కొంపకు సుబ్బుల రెక్కల కష్టమే దిక్కైంది.

తను ఏదైనా పనిచూసుకుని కూతుర్ని పని మానిపించేయాలని తల్లి ఎంత వెతికినా నిలకడగా నాలుగు రోజులు ఎవరింట్లోనూ పనిదొరకలేదు. కోటీశ్వరరావుగారి ఇంట్లో దొరికిందనేసరికి తన ఆరోగ్యానికి నిలకడ లేకుండా పోయింది.

మూడు రోజులుగా ఎండముఖం ఎరుగని ఊరు విషాదంగా ఉంది.

మూడు రోజులుగా వెలగని పొయ్యిలో పిల్లి, అంపశయ్య మీద తల్లి ముడుచుకు పడుకొని ఉండటంతో సుబ్బులు విచారంగా ఉంది. ముసురు వల్ల సుబ్బులుకు పని లేదు. ఇంట్లో సరుకులు లేవు.

''అమ్మకు తగ్గేలా లేదు. వర్షం వదిలేలా లేదు. పోనీ తను పని చేసే మేస్త్రీ దగ్గరకెళ్లి సాయం కోరితే? ఆలోచించింది. ''ఛఛ.. ప్రాణం పోయినా ఫర్వాలేదు. వాళ్ల దగ్గరకు వెళ్లకూడదు'' అంత లోనే అనుకుంది.

ఇంతకుముందొకసారి ఇలాగే చేతిలో చిల్లిగవ్వ లేకపోయేసరికి కాంట్రాక్టర్ దగ్గరకు వెళ్లింది. ఆ సమయంలో సుబ్బుల్ని చూసిన కంట్రాక్టర్ ముఖం చాటంతయింది. ''సమయానికి దేవతలా వచ్చావు. గొడౌన్ కారిపోతోంది. సిమెంటు బస్తాలు తడిసిపోతున్నాయి. అవి పక్కన పెట్టడానికి కాస్త సాయం పట్టు'' అన్నాడు. బస్తాల పని అయిపోయాక మనసులోని 'కోరిక' బయటపెట్టాడు. జబ్బల మీద చేతులు వేస్తూ దగ్గరకొచ్చాడు.

అంతే.. చెంప 'ఛెళ్'మనిపించి ''నేను అలాటి దాన్ని కాను'' అంటూ వాడిచ్చే డబ్బుల కోసం కూడా చూడకుండా పారిపోయింది.

బయట ఆకాశంలో మెరుపులు! పేదోళ్ల బతుకుల్లా.. బితుకుబితుకు మంటూ వెలిగే గుడ్డిదీపాల్లా..!

క్షణక్షణానికి గుడిశలో నీటిమట్టం పెరుగుతోంది. తల్లి పరిస్థితి క్షీణిస్తోంది. తల్లిని కాపాడుకోడానికి ఏమైనా చెయ్యాలి! కానీ ఏం చేయాలి?

సుబ్బులుకి దుఃఖం ముంచుకొస్తోంది.

ఆకాశంలో ఉన్నట్టుండి పెద్ద మెరుపు!

''దేవుడే దిగి వచ్చాడా?'' అన్నట్లు గుడిశ ముందో వ్యక్తి! మసగ్గా కనిపించాడు.

''ఎవరు లోపల?'' అడిగాడు జగన్నాథం.

''ఎవరు కావాలండీ? గుమ్మం దగ్గరకొచ్చి అడిగింది సుబ్బులు.

''మీ అమ్మ లేదా?''

''ఉందండి. బాగోలేదండి...''

''కోటీశ్వరరావుగారింటికి పనిలోకి వెళ్లటం లేదా?''

''జొరవండి. మూసిన కన్ను తెరవట్లేదండి.''

''పోనీ నువ్వు వెళ్లొచ్చుగా! ఇంట్లో చుట్టాలున్నారట. సాయంగా రమ్మన్నారు.'' అన్నాడు.

''ఏ క్షణాన ఏమవుతుందో ఏమోనని అమ్మని అంటిపెట్టుకొని ఉండిపోయాను గానీ, పనిలోకి నేను వెళ్లాల్సింది.. అనుకుంది. ఆ ఆలోచన అసలు తనకు రానందుకు తనను తాను తిట్టుకుంది. మారుమాటాడకుండా జగన్నాథం వెనక బయలుదేరింది.

''అమ్మా.. అన్నయ్య వచ్చాడా?'' ఆతృతగా అడిగింది తల్లి.

''లేదమ్మా. కోటీశ్వరరావు బాబు నుంచి కబురొచ్చింది.'' అంది.

తన పాచిక పారినందుకు మురిసిపోతూ జగన్నాథం నడుస్తున్నాడు. గొడుగు ఇద్దరికీ సరిపోక సుబ్బులు తడుస్తోంది.

తడిసిన దుస్తుల్లో సుబ్బులు కొత్త అందాలు పోతోంది. జగన్నాథం సంతృప్తిగా ఉన్నాడు.

కోటీశ్వరరావు ఇంటి దగ్గరి పరిస్థితి చూసి జగన్నాథం ఆశ్చర్యపోయాడు.

ఆయనింటి గేటు వరకూ కూడా నీళ్లొచ్చేశాయి. వరదనీరు ఆ ఇంటి గేటు వరకూ రావడం ఇంతకు మునుపు ఎప్పుడూ చూడలేదు. ''వర్షం ఇలాగే గానీ కురిస్తే ఈయన ఇంట్లోకి కూడా నీళ్ల వచ్చేయడం ఖాయం''.. అనుకుంటూ లోపలికి వెళ్లి సుబ్బుల్ని హాల్లో ఉండమని చెప్పి జగన్నాథం మేడ మీదకు వెళ్లాడు. సుబ్బులు దగ్గరకు వెళ్లేటప్పుడే దారిలో కొన్న విస్కీ సీసా తీసి టీపాయ్ మీద పెట్టాడు.

''ఇది సరే. 'అది' ఏది?'' అన్నట్లు కోటీశ్వరరావు చూశాడు.

''ముందు ఈ పని కానివ్వండి. కొత్త పిల్ల. ఇవన్నీ చూస్తే బెదిరిపోగలదు. అందుకే కింద ఉంచానన్నాడు.''

''ఔనా''.. అనుకుంటూ బాటిల్ ఓపెన్ చేశాడు.

''సార్.. ముసురు కదా.. స్మగ్లర్లు రేటు బాగా పెంచేశారు'' అన్నాడు.

కోటీశ్వరరావు జేబులోంచి గుప్పెడు నోట్లు తీసి ఇచ్చాడు. ఆ రౌండ్ అయిపోయింది. రెండో రౌండ్ స్టార్ట్ చేశాడు. అది కూడా అయిపోయే వరకూ ఆగి అప్పుడన్నాడు జగన్నాథం.

''సార్.. ముసురు వల్ల అమ్మాయిని పట్టుకోవడం చాలా కష్టమైంది. మళ్లీ మీ దగ్గర మాట పడాల్సి వస్తుందేమోనని భయపడ్డాను'' అని.

ఈసారి రెండు గుప్పెళ్లు! అన్నీ పెద్దనోట్లే!

''సార్.. 'భోజనం' వడ్డించడానికి అమ్మాయిని పంపించమంటారా?'' అడిగాడు.

''నీదే ఆలస్యం'' అన్నట్లు చూశాడు. గ్లాసులో మరో రౌండ్ పోశాడు.

కిందకు వచ్చి ''అయ్యగారితో అంతా చెప్పాను. పనంతా అయిపోయాక మీ అమ్మ వైద్యానికి డబ్బిస్తారు తీసుకో'' అన్నాడు.

సుబ్బులు జగన్నాథం కాళ్లమీద పడబోయేసరికి ఆమె జబ్బలు పట్టుకు లేవదీశాడు.

''పొంగుకొస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ'' నిజంగా మీ అంత మంచోళ్లు ఇంకొకరు ఉండరు. మీరు మా పాలిట దేవుడులా ఆదుకున్నారు. నేనేమీ చెప్పకున్నా మా అమ్మగురించి అంత శ్రద్ధ తీసుకున్నారు'' అంది.

''అవన్నీ తర్వాత. ముందు పద'' జగన్నాథం తొందరపెట్టాడు.

నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ సుబ్బులు వెళ్లింది.

ఆమెనే అనుసరిస్తూ జగన్నాథం కదిలాడు.

సుబ్బులు మెల్లగా గదిలోకి అడుగు పెట్టింది.


ఆ వెనకే ఉన్న జగన్నాథం బయట తలుపు గొళ్లెం పెట్టేశాడు.

సుబ్బులు బిత్తరపోయింది.

★ ★ ★

అనుకున్నదాని కన్నా ఎక్కువే ముట్టినందుకు జగన్నాథంలో అంతులేని ఆనందం.

వర్షం జోరు పెరిగింది. గాలి కూడా రేగింది. గొడుగుతో సహా విసిరికొడుతుంటే 'జోరు తగ్గేక వెళ్లవచ్చునని' ఓ చెట్టు మొదల ఆగేడు. జేబులోంచి రుమాలు తీసి ముఖం తుడుచుకుంటున్న జగన్నాథం తన



వైపు వస్తున్న ఓ మనిషిని చూశాడు. తన జేబు నిండా డబ్బు. అవి కనపడకుండా జాగ్రత్తగా ఉన్నా యోలేదో చూసుకున్నాడు.

ఆ మనిషి సరాసరి తన దగ్గరికే వచ్చాడు. తననే చూస్తున్నాడు.

జగన్నాథం మనసులో ఏదో మూల భయం! ''దొంగ వెధవలు అతనుకోసం చూస్తుంటారు. జాగ్రత్తగా ఉండాలి..'' లేని ధైర్యాన్ని తెచ్చుకుంటు న్నాడు. ''ఇలాటివాడి పక్కన నిల్చోవడం కన్నా, వానలో వెళ్లడమే సేఫ్.'' అనుకుంటూ కదిలిన వాడ్ని.

''ఏయ్..నిన్నే''. పిలిచాడతను.

''ఏవిటన్నట్లు?'' వెనక్కి చూశాడు జగ న్నాథం.

''ఇందాక నీతో వచ్చిన అమ్మాయేది?'' అడి గాడు.

జగన్నాథం గతుక్కుమన్నాడు. అయినా అలా కనపడకుండా ''అమ్మాయా! ఎవరు నువ్వు?'' అన్నాడు ఆశ్చర్యాన్ని నటిస్తూ.

''ఏమీ ఎరగనట్లు మాటాడక. ఆ పిల్ల నా చెల్లెలు. నా పేరు సూరీడు. ఎవరో వచ్చి ఇప్పుడే తీసుకువెళ్లారని మా అమ్మ చెప్పింది. మీరిద్దరూ ఆ మేడలోకి వెళ్లడం దూరం నుంచి నేను చూశాను. ఇద్దరూ వెళ్లి నువ్వొక్కడివే తిరిగొస్తు న్నావు. నా చెల్లెల్ని ఏం చేశావు చెప్పు'' అని గద్దిం చాడు.

సూరీడు వాలకాన్ని చూసిన జగన్నాథానికి అంత వర్షంలోనూ చెమటలు పట్టాయ్. వాడి చొక్కా చిరిగుంది. వాడి గెడ్డం మాసుంది. పళ్లు, కళ్లు ఎర్రగానే ఉన్నాయి. 'నిజం చెబితే ఏం చేస్తాడో ఏమోనని' ''నిజంగా నాకు తెలీదు'' అని బుకా యించబోయాడు.

''నీయవ్వ. తెలీదు.. తెలీదు?!'' అంటూ పళ్లు బిగిస్తూ మీదకొచ్చి జగన్నాథం కంఠం పట్టు కొన్నాడు.

''అమ్మో... చంపేస్తాడేమో చెప్పకపోతే'' అని భయపడిపోయాడు. ''కోటీశ్వరరావు పడగ్గదిలో ఉంది'' అన్నాడు.

అది విన్న సూరీడు హతాశుడ య్యాడు. అంతలోనే చిన్నపిల్లవా డిలా ఏడుస్తూ ''ఛీ.. పాపాత్ముడా ఎంత పని చేశావురా. నా చెల్లెలు దేవ తరా. మేం పూటకు గతి లేని వాళ్లమే కావొచ్చు. కానీ నీతిమాలిన వాళ్లం కాములురా'' అంటూ వలవల ఏడ్చాడు... ఏం చేయలా తోచని చిన్న పిల్లవాడిలా.

జగన్నాథం అవాక్కయ్యాడు. సిగ్గుతో తలదించుకున్నాడు. ''కూలోళ్ల కుటుంబాల్లో ఇవన్నీ మామూలే అని తను ఊహించిందొకటి జరిగిం దొకటి. కడుపు కోసం పడుపు వృత్తికైనా వెనకాడని వాళ్లలో సుబ్బులు కూడా ఒకతె అని ఊహించి ఎంత పొరపాటు చేశాను! వీల్లేదు. అలా జరగడా నికి వీల్లేదు. నా వల్ల ఓ కన్నెబతుకు బలికాకూ డదు''... అని పశ్చాత్తాపంతో ఆలోచిస్తున్నాడు. పట్టుదలతో ఆలోచిస్తున్నాడు.

సుబ్బుల్ని తనే గదిలోకి పంపి మళ్లీ తనే కాపాడ్డం ఎలా? అందులోనూ కోటీశ్వరరావు ఇంట్లోకి.!

బయట ఆకాశంలో మెరుపులు! అందివచ్చిన అవకాశాల్లా అలరిస్తూ.. అబ్బురపరుస్తూ..

మెరుపు వెలుగులో చెట్టుమీదకు ఎగబాకుతూ ఓ పాము! పక్షిగూడులోని గుడ్ల కోసం దాని పరుగు.

అంతలోనే పక్షులు ప్రాణభయంతో అరి చాయి. పాము ఖాతరు చేయలేదు.

దాంతో రెండేసి మూడేసి పక్షులు ఓ గంపుగా అయి రెక్కలు టపటపలాడిస్తూ ముక్కుల్ని పిడి బాకుల్లా జోడిస్తూ ఓ గుంపు తర్వాత మరొక గుంపు పాము మీదకు లంఘించాయి.

పాము తోక ముడిచింది.

జగన్నాథం బుర్రలో వెలుగురేఖ పొడిచింది.

సూరీడ్ని పిలిచి చెవులో ఏదో చెప్పాడు. వాడు చిలకపేటవైపు ఉరికాడు.

జగన్నాథం మేడవైపు పరుగు తీశాడు.

★ ★ ★

మీదకొచ్చిన కోటీశ్వరరావును తప్పించుకొని పారిపోవడానికి తలుపులు తీయబోయింది సుబ్బులు. బయట గొళ్లెం పెట్టేయడంతో గది లోని వెనక గుమ్మంలోంచి డాబా మీదకు పారిపో యింది. ఆమెను వెంటాడుతూ కోటీశ్వరరావు కూడా మేడ ఎక్కాడు.

మాన భయంతో సుబ్బులు.. కామప్రకోపంతో కోటీశ్వరరావు పరుగుతీస్తున్నారు.

కొదమసింహంలా అతను. లేడిపిల్లలా ఆమె ఆయాసపడుతున్నారు.

ఒక్క క్షణం ఆలస్యమైతే సుబ్బులు దొరికిపో యేదే! సరిగ్గా ఆ సమయంలో అడుగుపెట్టాడు జగన్నాథం. వస్తూనే ''ఆగండి. ఆ అమ్మాయినేమీ చేయకండి!'' అని అరిచాడు.

మత్తెక్కి మదవెక్కి ఉన్న కోటీశ్వరరావుకు మతిపోయింది. ''స్కౌండ్రల్. ఆ మాట అనడా నికి నువ్వెవడవురా? అసలు నా పర్మిషన్ లేకుండా ఎవడ్రా నిన్ను రానిచ్చాడు'' అని గర్జించాడు.

''సాటి మనిషికి అన్యాయం జరుగుతున్న ప్పుడు అడ్డుకోడానికి ఎవరూ ఎవరికీ అనుమతి ఇవ్వక్కరలేదు'' అన్నాడు ధాటీగా.

''అది మనుషులకే రా చెల్లింది. మా మోచేతి నీళ్లు తాగి బతికే నీలాంటి కుక్కలకు కాదు.''

''నిజమే. మేం మనుషులమేనన్నది మరిచి మీకు వంతపాడినన్నాళ్లూ మీ ఆటలు సాగాయి. మాసాటి మనుషులకు అన్యాయం జరిగింది. మేం తప్పు తెల్సుకున్నాం. నన్ను కాదని ఆ అమ్మాయిని ఏం చేసినా ఊరుకోను..'' అంటూ కింది ఓ వారన ఉన్న ఖాళీ సీసా తీసి పగలగొట్టి పిడిబాకు లాగ గురిపెట్టాడు.

కోటీశ్వరరావు ఉగ్రనరసింహుడయ్యాడు. ''యూ డర్టీ స్కౌండ్రల్.. ఎంత ధైర్యంరా నీకు! నా మీదకే వస్తావా?'' అంటూ అటూ ఇటూ చూశాడు. పక్కన గోడకు చేరవేసి ఉన్న కర్ర కని పించింది. దాన్ని తీసుకొని జగన్నాథాన్ని కొట్టబో యాడు.

అంతవరకూ శోకతప్త వదనంతో దీనంగా ఉన్న సుబ్బులు విద్యుత్ఘాతానికి చలనం పొందిన దాన్లా మెరుపువేగంతో మీద పడి లాక్కొని ''జాగర్త. మమ్మల్ని కాదని ముందుకొచ్చావో మాడుపగు లుద్ది'' అని ఆ కర్రనే ఎత్తింది.

మేడకింద అలజడి! ఓ వైపు క్షణక్షణానికి ముంచుకొస్తున్న వాన నీరు!

మరో వైపు - గుంపుల గుంపులుగా కదిలివ స్తున్న సూరీడు మనుషులు!

మేడమీద ఒక పక్క - సహస్ర చైతన్య కిరణా లతో ప్రజ్వరిల్లే జగన్నాథునిలాగ జగన్నాథం!

మరోపక్క - పరమశివుడ్ని సైతం తలదన్నిన ఆదిశక్తిలా సుబ్బులు కనిపిం చేసరికి -

చేష్టలుడిగి వెనకడుగు వేయటం కూడా మరిచి మిడిగుడ్లతో చూస్తూ బొమ్మలా నిల్చుండిపోయాడు కోటీశ్వ రరావు!

బయట ఆకాశంలో ఉరుములు... మెరుపులు! అచ్చమైన కాంతికిరణాల్లా.. స్వచ్ఛమైన శాంతి చరణాల్లా!!

